

పోల్కంపల్లిలో..



పర్దిపురంలో..



నంచర్లలో ..

వైభవంగా హరితోత్సవం



కందూర్‌లో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని ఓబ్లాయిపల్లి గ్రామంలో హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చంద్రకళ, ఏఈఓ కృష్ణకాంత్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో హరిత దినోత్సవం నిర్వహించారు.కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఎంఈ సుబ్రమణ్యం, డీఈఈ బెంజిమన్, ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

భూత్పూర్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం హరితోత్సవంలో భాగంగా మద్దిగట్లలో మొక్కలను నాటారు. గోప్లాపూర్ వద్ద చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కొప్పెటలో వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్ మొక్కలు నాటారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: ఎంపీపీ రమాదేవి దేవరకద్ర మైనార్టీ గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ విజయలక్ష్మి, ఈవో సీత్యానాయక్ పాల్గొన్నారు.

గండీడ్: మండలంలో హరితోత్సవం ఘనంగా నిర్వహించారు. అటవీ ప్రాంతం అయిన కొండాపూర్ సెక్షన్ పరిధిలోని కొంరెడ్డిపల్లి సమీపంలో వందలాది మొక్కలు నాటారు. సెక్షన్ ఆఫీసర్ నర్సిములు సమక్షంలో, అధికారులు ,ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అటవీ ప్రాంతంపై అవగాహన కల్పించారు. రెంజ్ అధికారి మక్బూల్‌హుస్సేన్, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి , ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలో వివిధ గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ర్యాలీలు నిర్వహించారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతుబంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, కోఆప్షన్ తాహేర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, ఎస్ఐ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నంచర్ల, గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మొకర్లాబాద్, మహమ్మదాబాద్ గ్రామాల్లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, సర్పంచ్ కేఎం అనసూయ, నారాయణ, ఏపీఓ హరిచ్చంద్రుడు, అంజనేయులు, ఉపసర్పంచ్ వెంకటేష్, పాల్గొన్నారు.

బాలానగర్: ఎంపీడీఓ కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, ఆర్ఐలు వెంకట్ రెడ్డి, రాజేశ్వరిలతోపాటు పలువురు వారి వారి కార్యాలయాల్లో హరితహార కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



లింగంపల్లిలో ..



మద్దిగట్లలో..



దేవరకద్రలో..



ఓబ్లాయిపల్లిలో..



కొండాపూర్ సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో..



పోలీస్‌లైన్ స్కూల్ సమీపంలో..

క్లుప్తంగా

24 గంటల్లోనే ఫోన్ రికవరీ



నవాబుపేట: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను పోలీసులు రికవరీ చేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపూర్ మండలపరిధిలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన లచ్చిరాం (రూ. 50 వేల విలువైన) ఫోన్ ఆదివారం నవాబుపేట సంతలో చోరీకి గురైంది. దీంతో అతడు పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు ట్రేస్ చేసి 24 గంటల్లోనే ఫోన్‌ను రికవరీ చేశారు. బాధితుడికి సోమవారం అందించారు.

21న వీరభద్రస్వామి భూముల కౌలువేలం

భూత్పూర్: తాటికొండలోని బాలాజీ ఈశ్వర వీరభద్రస్వామి దేవస్థానం భూముల కౌలు వేలం 21న గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు బహిరంగ వేలం వివరాలను దేవాలయం కార్యనిర్వహణాధికారి రామన్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 సంవత్సరానికి గాను 27 ఎకరాల 4 గుంటల భూమి కి రూ.2వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాల్గొనాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యే రాక

దేవరకద్ర: గూరకొండ గ్రామంలో మంగళవారం నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రానున్నట్లు, ఆయన క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు భూత్పూర్ ఉన్నత పాఠశాలలో నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు దేవరకద్ర మండలం గూరకొండలో మన ఊరు మన బడి కార్యక్రమంలో పునర్నించిన పాఠశాల ప్రారంభోత్సవం, ముదిరాజ్ కమిటీ హాల్‌కు భూమి పూజ, హైమాక్స్ లైట్లను ప్రారంభిస్తారు.

బాధిత కుటుంబాలకు బీమాతో ఆసరా



నవాబుపేట: పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలకు బీమాతో ఆసరా లభిస్తుందని ఎంపీపీ అనంతయ్య అన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. కారూర్ గ్రామానికి చెందిన వల్లూరి కృష్ణయ్య ఓ కంపెనీ బీమా చేయించుకున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో సంబంధిత బీమా రూ. 1.31 లక్షల చెక్కును అతడి భార్య శోభకు కంపెనీ ప్రతినిధులతో కలసి ఎంపీపీ సోమవారం అందించారు.

అడ్మిషన్లు రద్దు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్రవ్యాప్తంగా బీసీ కాలేజీ హాస్టళ్లలో ఆన్‌లైన్ అడ్మిషన్లను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యుడు శ్రీనాథ్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆన్‌లైన్ అడ్మిషన్లు పెట్టడం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తుందని అన్నారు. బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు లేక సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా కిరాయి భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు పక్క భవనాలను నిర్మించాలని కోరారు. మణికంఠ, నందు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చేయూత

జడ్చర్ల: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చేయూతనిస్తోందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.12.40 లక్షల చెక్కులను 25 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంతకు ముందు ఆయన జడ్చర్లలో వంద పడకల ఆస్పత్రిని సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, రోగులకు కావలసిన అన్ని వసతులు, వివిధ విభాగాలకు సంబంధించిన వైద్య సదుపాయాలు కల్పించామని తెలిపారు. చిన్నపిల్లలకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు.బాదేపల్లి ఆస్పత్రిలో వృద్ధులకు అందుబాటులో వైద్య పరీక్షలు చేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ లక్ష్మి పాల్గొన్నారు.



మట్టి అక్రమ తరలింపు : కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని కాటవరం శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. కాటవరం గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లలో స్థానిక గుట్ట నుంచి గ్రామంలోకి సోమవారం అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారన్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాలో అప్పగించారని వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ నర్ర శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు



కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు సోమవారం కొనసాగాయి. ఈసందర్భంగా మండల సాధనసమితి కన్వీనర్ రామునాయక్, వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గార్లపహాడ్ మండలం కావాలని 15 గ్రామపంచాయతీల ప్రజలు మద్దతు తెలుపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇదే వైఖరి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

నూతన భవనానికి స్థలం కేటాయించండి



మహమ్మదాబాద్: మండలంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నందున నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు ఆయనతో మాట్లాడుతూ గిరిజనులు ఎక్కువగా ఉన్నందున మండల కేంద్రంలో భవనానికి స్థలాన్ని కేటాయిస్తే అలాంటి భవనాల్లో విద్యార్థులకు గోర్‌శిక్వాడీ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీషులాంటివి నేర్పించుకోవచ్చని కోరారు. అందుకు ఎమ్మెల్యే అంగీకరించినట్టు వివరించారు. పాండునాయక్, నీలేష్, పాల్గుణ, సురేష్, గోపాల్, పాండు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు 8880.. నోటుపుస్తకాలు 6656



మహమ్మదాబాద్‌లో పంపిణీకి సిద్ధంగా చాలీ చాలని నోటు పుస్తకాలు

మహమ్మదాబాద్: పాఠశాలల ప్రారంభోత్సవం సమయంలో స్వయంగా విద్యాశాఖమంత్రి ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సరిపడు నోటు పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం తలా ఒకటి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొనేందుకు సిద్ధమవుతున్నారని వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తుందన్న ఆశతో ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని, ఒకటి మాత్రమే అందిస్తే ఎలా అని అంటున్నారు. ఉమ్మడి గండేడ్ మండల వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 8,880 మంది విద్యార్థులు ఉండగా వారికి 6,656 నోటు పుస్తకాలు వచ్చాయి. దీంతో విద్యార్థికి ఒక్క నోటుపుస్తకం కూడా ఇవ్వడం సాధ్యం కాదని ఉపాధ్యాయులంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో 7నుంచి 10 తరగతుల వారికి 14, 3 నుంచి 6 తరగతుల వరకు 8 నుంచి 10నోటు పుస్తకాలు అవసరం ఉంటాయని అంటున్నారు. విషయమై ఎంఈఓ వెంకటయ్యను వివరణ కోరగా మొదటి విడతగా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఇచ్చేందుకు కొన్ని పంపిణీ చేశారని, రెండో విడతో మరిన్ని అందరికీ పంపిణీ చేస్తామన్నారు. అప్పటివరకు విద్యార్థుల పరిస్థితి ఏమిటనీ పలువురు ప్రశ్నిస్తున్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు విద్యాదినోత్సవాన్ని జిల్లాలో నిర్వహించనున్నారు. నోటు పుస్తకాలు, యూనిఫాంలు, రాగిజావ పంపిణీ తదితర కార్యక్రమాలను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలకు మొదటి విడతగా 34,800 నోటు పుస్తకాలను జిల్లా గోడౌన్ నుంచి సోమవారం అధికారులు సరఫరా చేశారు. రాగి జావాను జిల్లా కేంద్రంలోని మాడల్‌బేసిక్ పాఠశాల, మోమిన్‌వాడి పాఠశాలల్లో ప్రారంభించనున్నారు.

వానలు కురవాలని పూజలు



జలాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అడ్డాకుల: మండలంలోని వర్నె గ్రామంలో సోమవారం గ్రామస్తులు వర్షాల కోసం పూజలు చేశారు. గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జలాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ బంగారయ్య, చంద్రకాంత ఆచార్యులు, నరేంద్రశర్మ, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: పర్దిపురం రైతులు గ్రామంలోని శివాలయంలో లింగానికి వర్షాలు కురవాలని కోరుతూ జలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ కోట సుప్రియ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోట రాము, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

జడ్చర్ల: గ్రామ పంచాయతీ ఉద్యోగ,కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. జూలై 6 నుంచి సమ్మెకు దిగనున్నట్లు నోటీసును పంచాయతీ కార్మిక సంఘం నాయకులతో కలిసి సోమవారం ఎంపీడీఓ ఉమాదేవికి సమర్పించారు. సంఘం మండలశాఖ అధ్యక్షుడు ఎండీ పాష, నాయకులు చంద్రయ్య, నర్సిములు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలో ప్రయాణికులకు వాటర్‌బాటిళ్లు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు



దేవరకద్రలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. ప్రయాణికులకు స్వీట్లు, వాటర్‌బాటిళ్లు అందజేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, సీనియర్ నేత చంద్రకుమార్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములుయాదవ్ పాల్గొన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న జిల్లా మహిళ అధ్యక్షురాలు అసహనం వ్యక్తం చేశారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని స్వామి వివేకానందచౌరస్తాలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ మహేందర్‌గౌడ్, జి.రవీందర్, విద్యాసాగర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రామునాయక్, నరేందర్‌గౌడ్, రవినాయక్, పాషి, కృష్ణయ్య, ఆర్యవెంకట్రాములు, విఠల్ పాల్గొన్నారు.

భూత్పూర్: మున్సిపాలిటీతోపాటు మండలంలోని కర్వెన గ్రామంలో సోమవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అరటి పండ్లు పంపిణీ చేశారు.మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్, నేతలు గోవర్ధన్ గౌడ్, హర్యానాయక్, ఎంపీటీసీ ఊషన్న, మాధవ రెడ్డి, తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, నాయకులు టీసీ శ్రీనివాస్, వీరారెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండలంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. బీసీసెల్ నాయకుడు టీ శ్రీను, మండల కోఆప్షన్ మెంబర్ మహిమూద్, మండల యూత్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిత్యానందం, వార్డు కౌన్సిలర్ విజయ్, సర్పంచ్ గాంగ్యానాయక్, వంశీ, రఘు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూతబడిన ప్రాథమిక పాఠశాల భవనం

- శిథిలావస్థలో తరగతి గదులు
- ఊడిపడుతున్న పెచ్చులు
- తప్పనిసరి పరిస్థితిలో హైస్కూల్‌లో కొనసాగింపు
- నూతన భవనం నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి



మూతపడిన ప్రాథమిక పాఠశాల

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల మూతపడింది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో గతేడాది అధికారులు ఖాళీ చేయించారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే.. ప్రాథమిక పాఠశాలను కూడా కొనసాగిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతి గదులు ఉండగా వాటిలో చాలా గదుల్లో గోడలు శిథిలమయ్యాయి. వరండాలో పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపోయాయి. ఈనేపథ్యంలోనే గత విద్యా సంవత్సరంలో పాఠశాలను మరో చోటికి తరలించే అంశంపై చాలా రోజుల పాటు తర్జనభర్జన పడ్డారు. రెండు, మూడు మండల సభల్లో ఇదే అంశంపై వాడీవేడిగా చర్చ సాగింది. భవనం కూలి విద్యార్థులకు ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారన్న అంశం అందరినీ గందరగోళానికి గురి చేసింది. దీంతో గత విద్యా సంవత్సరం ఏప్రిల్ రెండో వారంలో పాఠశాలను హైస్కూల్‌లోకి మార్చారు.



వరండాలో పైకప్పు నుంచి ఊడిపడిన పెచ్చులు

మూడు గదులకే పరిమితం..

తాత్కాలికంగా ప్రాథమిక పాఠశాలను ప్రస్తుతం హైస్కూల్‌లో కొనసాగిస్తున్నారు. కానీ అయిదు తరగతులకు గానూ మూడు గదులను మాత్రమే కేటాయించారు. ప్రస్తుతం 94 మంది విద్యార్థులు ఉండగా వీరిని మూడు గదుల్లో సర్దుబాటు చేసి నలుగురు ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు. దీనివల్ల ఒక్కో తరగతిలో రెండు, మూడు తరగతులను కలిపి విద్యా బోధన చేయాల్సి వస్తోంది. తద్వారా విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఒక తరగతి విద్యార్థులకు చెప్పే పాఠాలు మరో తరగతి విద్యార్థులు కూడా వినాల్సి రావడంతో కొంత గందరగోళం ఏర్పడుతోందని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మన ఊరు, మన బడి కింద మొదటి విడతలో ఈ పాఠశాలను ఎంపిక చేయలేదు. శిథిలమైన బడిని కూల్చి వేసి కొత్త బడి నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించినా ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. ఈ ఏడాదంతా ఉన్నత పాఠశాలలోనే ప్రాథమిక పాఠశాల కొనసాగించాల్సిన పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం కోసం నిధులు విడుదల చేయించి త్వరగా నిర్మాణం జరిగేలా చూడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త భవనం నిర్మిస్తే బాగుంటుంది



శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఖాళీ చేసి ఉన్నత పాఠశాలలోకి గతేడాది మార్చాం. ప్రస్తుతం మూడు గదులను కేటాయించారు. 94 మంది విద్యార్థులకు వాటిలోనే చదువులు చెబుతున్నాం. పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– రాములు, హెచ్‌ఎం, కందూర్ పీఎస్